క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ

గాలివీడు : గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలపై సచివాలయ మహిళా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌ఐ వెంకట శివ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాలలో చెడు ప్రవర్తనతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల ప్రత్యేక దృష్టి ఉంచి, ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి

చిన్నమండెం : మండలవ్యాప్తంగా పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం నాడు - నేడు పనులపై ప్రధానోపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ నాడు - నేడు పనులను నాణ్యతగా చేయాలని సూచించారు. అలాగే ఎంఈఓలు పనులను పరిశీలించి నాణ్యతగా పనులు చేసేటట్లు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు శివానాయక్, ఆంజనేయులు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



జి.శ్రీజ

పుల్లంపేట : నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థి జి.శ్రీజ ఏపీ అండర్-19 టీమ్‌కు ఎన్నికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ బాలశేఖర్‌లు వెల్లడించారు.

వై. కోట విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె : ఒంగోలులో ఈనెల 3వ తేదీ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ - 17 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కడప జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం పొందింది. దీంతో జిల్లా జట్టులోని క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వై.కోట ప్రధానోపాధ్యాయులు ఇక్బాల్ తెలిపారు. మంగళవారం వైకోట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్ - 17 జాతీయ జట్టుకు ఎంపికైన చీర్ల యథిన్ చందన్, మేకల మనోజ్ కుమార్‌లను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎంపిక అవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని సూచించారు. క్రీడాకారుల ఎంపికకు కృషి చేసిన అబ్దుల్ కరీమ్‌ను తోటి ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కును అందజేస్తున్న వెంకటసుబ్బయ్య

పెనగలూరు : సుండుపల్లె మండలం ఏటిగడ్డ రాచపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ. 1,00,116లను విరాళాన్ని చెక్కు ద్వారా అందించినట్లు ఎన్‌ఆర్‌ఐ బీసీ సంఘం అధ్యక్షుడు తురక వెంకట సుబ్బయ్య తెలిపారు. ఏటిగడ్డ రాచపల్లిలో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు అక్కడి ఆలయ కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకురావడంతో ఆలయ నిర్మాణానికి విరాళం అందించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ స్పందన అమోఘం

- సంక్షేమాభివృద్ధి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ప్రభుత్వ విప్ కొరముట్ల, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి



సంక్షేమ బావుటాను అందిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, కొండూరు అజయ్‌రెడ్డి

పెనగలూరు : పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం ఈటమాపురం పంచాయతీలోని మూగవారిపల్లె, నాయుడు వారిపల్లె, దళితవాడలు, అరుంధతివాడలు, ఎస్టీ కాలనీలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక్క ఈటమాపురం పంచాయతీకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రూ. 3.31 కోట్లు ప్రజలు, రైతుల ఖాతాలలో నేరుగా జమ అయ్యిందన్నారు. 804 కుటుంబాలు ఈ పంచాయతీలో ఉన్నాయని, మూగవారిపల్లెకు చెందిన దళితులు విద్యుత్ సమస్య ఉందని, తమ వీధిలో ఒక చోట రోడ్డు సరిగాలేదని నాయకుల దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి సమస్య పరిష్కరించాలని తెలియజేశారు. అలాగే ఈటమాపురం అరుంధతివాడలో ఇంటిపై కప్పు ఉరుస్తుందని నాయకుల దృష్టికి తీసుకురాగా హౌసింగ్ అధికారులను పిలిపించి వెంటనే బాధితులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా వారివారి ఖాతాలలో నగదు జమ చేస్తున్న ప్రభుత్వం తమదని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఆ పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందేవన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన అమోఘమని వారు కొనియాడారు. ముఖ్యంగా కరువు మండలాలలో ఉపాధి పనులను నిర్విరామంగా పెంచి ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎవరికి ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మూగవారిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, ఈటమాపురం శంకర్ రెడ్డి, నాయుడువారిపల్లి యానాది రెడ్డి, సుధాకర్ రెడ్డి, వ్యవసాయ సలహామండలి మండల అధ్యక్షులు సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, గోపాల్ రెడ్డి, చాంద్ బాషా, యానాదిరెడ్డి, దేవంద్రరెడ్డి, సుధాకర్ రెడ్డి, అనీల్, గోపినాథ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, వేణుగోపాల్ రెడ్డి పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు చేసుకోండి



టపాసుల దుకాణాల ఏర్పాటుపై సూచనలు ఇస్తున్న తహసీల్దార్ పుల్లారెడ్డి

ఓబులవారిపల్లె : నిబంధనలకు లోబడి మండలంలో లైసెన్సు పొందిన టపాసుల దుకాణాదారులు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని అతిక్రమిస్తే దుకాణాలు దుకాణాలు తొలగించి లైసెన్సు రద్దు చేస్తామని తహసీల్దార్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో లైసెన్సు పొందిన దుకాణాదారులు, పోలీస్ సిబ్బందితో తహసీల్దార్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ టపాసుల దుకాణాలు కేటాయించిన స్థలంలోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల మధ్య మూడు మీటర్లు వ్యత్యాసం ఉండాలని, రేకుల షెడ్డులో దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వే డీటీ రామ్మోహన్, ఆర్‌ఐ రామ్మోహన్, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించండి

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నీటి ఎద్దడిపై సమీక్షించిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : తీవ్ర వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తుతున్న తరుణంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి పారుదలశాఖ అధికారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాయచోటిలోని తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా, నియోజకవర్గ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని మండలాల వారీగా తాగునీటి సమస్యపై శ్రీకాంత్ రెడ్డి ఆరా తీశారు. గ్రామాలలోని తాగునీటి తీవ్రతను బట్టి ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయచోటి రూరల్ మండలంలో మాధవరం, సిబ్యాల, సంబేపల్లె మండలంలోని శెట్టిపల్లె గ్రామంలోని రఘుపతి ఇండ్లు, తాటిగుంట హరిజనవాడ, నాగిరెడ్డిపల్లె, తిమ్మక్కగారిపల్లె, చిన్నమండెం మండలంలోని చాకిబండ గ్రామంలోని వరదన్నగారిపల్లె, సి.పాలిమేరపల్లె తదితర గ్రామాలలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. ఆయా గ్రామాలలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాటర్ గ్రిడ్ పనులపై ఎమ్మెల్యే చర్చించారు. రోళ్లమడుగు నీటి పథకంలో భాగంగా రామాపురం బీసీ కాలనీ వద్ద సంప్ ఏర్పాటు పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన తాగునీటి పనులు, జేజేఎం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రూ. 4 కోట్ల నిధులతో చేపట్టిన చెన్నముక్కపల్లె తాగునీటి పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తాగునీటిని ట్యాంకర్లు ద్వారా సరఫరా చేసిన పెండింగ్ బకాయిలు ఎంతమేర ఉన్నాయని అధికారులను అడుగగా రూ. 4.20 కోట్ల మేర ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ తెలిపారు. సదరు బిల్లుల చెల్లింపులకు కృషి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రసన్న కుమార్, డీఈలు శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, అన్ని మండలాల ఏఈలతోపాటు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, తొగట వీరక్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్, సింగల్ విండో అధ్యక్షుడు ఎర్రమరెడ్డి, బిసి నాయకుడు పాలెం రామచంద్ర, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లెకు చెందిన విశ్రాంత సైనికుడు సూరం రామచంద్రారెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఆయన స్వగృహంలో రామచంద్రారెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట జెడ్పీటీసీ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

రాజంపేట రూరల్ : మండలంలోని పెద్దకారంపల్లె పంచాయతీని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. విధులకు సంబంధించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను తనిఖీ చేసిన జిల్లా ప్రత్యేక కలెక్టర్



విద్యార్థులను విచారిస్తున్న అధికారులు

రాజంపేట టౌన్ : స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను మంగళవారం రాత్రి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ అకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులకు వసతి గృహ అధికారిణి శోభారాణి మెనూ మేరకు భోజనం పెట్టడం లేదని ఇటీవల ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప నాయక్, జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మితో కలిసి హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను వేర్వేరుగా విచారించారు. విచారణకు సంబంధించిన నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లికి చెందిన కాంతమ్మ (62) అనే మహిళ మంగళవారం తన ఇంటి ముందు చెత్త శుభ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇదే గ్రామానికి చెందిన పెద్ద వెంకట్రమణ అనే వ్యక్తి ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు ఆమెను ఢీకొన్నాడు. అనంతరం ట్రాక్టర్ పిట్ట గోడను ఢీకొంది. ఈ ఘటనలో కాంతమ్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను తిరుపతి ఆసుపత్రికి తరలిచారు. బాధితురాలి భర్త రామచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు.

నేడు విద్యా సదస్సు

కేవీపల్లె : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గ్యారంపల్లెలో విద్యాసదస్సు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిలా ట్రెజరర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న విద్యా సదస్సులో ప్రస్తుతం విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు - ఉపాధ్యాయుల కర్తవ్యంపై చర్చించనున్నట్లు తెలిపారు.

కందిలో సస్య రక్షణ పాటించాలి

కలికిరి : కంది పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని డీఆర్‌సీ ఏడీఏ ఎంవీ శ్రీకాంత్, కేవీకే శాస్త్రవేత్త పీరూసాహెబ్ తెలిపారు. మండలంలోని పత్తేగడ గ్రామంలో కంది పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందిలో శనగపచ్చ, వెర్రి తెగులు పురుగు గుడ్లను గమనించామని, ఈ తెగులుతో మొక్కలో పూత, కాయ ఏర్పడదన్నారు. రైతులు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పత్తేగడ రైతు భరోసా కేంద్రంలో రైతులతో కంది సాగులో యాజమాన్యంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ లోకేష్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

10న తోలుబొమ్మలాట

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 10వ తేదీన తోలుబొమ్మలాట ప్రదర్శన నిర్వహించనున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ 225వ జయంతి సందర్భంగా సాయంత్రం 6.00 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారన్నారు. ఇందులో భాగంగా తోలుబొమ్మలాట కళాకారులు సుందరకాండను ప్రదర్శిస్తారన్నారు.

రక్తదానం

వైవీయూ : రక్తదాన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ సొసైటీ, జేబీవీఎస్ స్వచ్ఛందసేవా సంస్థ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తాన్ని కృత్తిమంగా తయారు చేయలేమని, రక్తదానం ద్వారా మాత్రమే ఆపదలో ఉన్నవారికి అందించవచ్చని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించండి



మాట్లాడుతున్న ఈటీపీఆర్‌డీ పులిరామ్‌సింగ్

సిద్దవటం : జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులతో పూర్తి చేయించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, హౌసింగ్ అధికారులకు ఈటీపీఆర్‌డీ బి. పులిరామ్‌సింగ్ సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి ఆయన పలు సూచనలు చేశారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులకు వారి ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇప్పటి వరకు బిబిఎల్‌లో 1, బిఎల్ స్టేజీలో 35, ఆర్‌ఎల్‌లో 24, ఆర్సీ స్టేజీలో 4, ఉన్నాయన్నారు. బిబిఎల్, బిఎల్, ఆర్‌ఎల్ స్టేజీలలో ఉన్న కట్టడాలను ఆర్సీ స్టేజీకి వచ్చేలా చూడాలన్నారు. వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలో వీధి దీపాలు పగటిపూట వెలిగినా, వీధులలో చెత్త పడిఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి నితీష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శపాఠశాలలో చదువుతున్న నితీష్ మంగళవారం ఎస్‌జీఎఫ్ అండర్ - 17 తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠరావులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పోటీలలో తమ పాఠశాల విద్యార్థి రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం వారు విద్యార్థి నితీష్‌ను అభినందించారు.

తరగతి గది నుంచే మార్పు రావాలి



ఎల్‌ఐపీ మాడ్యూల్‌ను విడుదల చేస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : విద్యార్థులలో మార్పు తరగతి గది నుంచే రావాలని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రెడ్డెప్ప రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి డైట్ కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ కాంప్లెక్స్ పరిధిలోని ఉన్నత పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థికి తరగతి గది నుంచే మార్పు మొదలవ్వాలని చెప్పారు. బోధనలో చదవడం, రాయడం, సబ్జెక్టుల నిర్ధారణ ఫలితాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తరగతి గదిలో మెరుగైన బోధన పద్ధతిని పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు శివభాస్కర్, కల్పన, జిల్లా కో - ఆర్డినేటర్ రెడ్డెయ్య, అన్నమయ్య జిల్లా ఏఎంఓ షమీవుల్లా, ఎంఈఓలు వెంకటశివారెడ్డి, జయచంద్ర, ఆంజనేయుల నాయుడు, ఎస్ఆర్‌పీ వసంత తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందించుకోండి

నందలూరు (రాజంపేట) : ప్రతి విద్యార్థి మానవతా విలువలను పెంపొందించుకొని జీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాజంపేట మండల శాఖ అధ్యక్షుడు లయన్ అబ్దుల్లా, డైరెక్టర్ వేణుగోపాల్ నాయుడులు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నైతిక విలువలపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యాలు, ఉద్దేశాలు, అందిస్తున్న సేవలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మానవత డైరెక్టర్ గంగనపల్లి వెంకటరమణ, ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, శిల్పి ఆనందాచారి, తులసీ, స్వర్ణలత, రమణమ్మ, రవిశంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆర్‌వి రమణమ్మ, ప్రమీళా రాహేల్, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ : కార్తీకమాసం పురస్కరించుకుని 22న శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 22న మదనపల్లె నుంచి సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 5.30 గంటలకు బయలుదేరి నందలూరు, ఒంటిమిట్ట, దేవుని కడప దర్శించుకుని శ్రీశైలానికి రాత్రికి చేరుకుంటుందన్నారు. 23న ఉదయం శ్రీశైలం నుంచి మహానంది, యాగంటి, అహోబిళం దర్శించుకుని రాత్రి 12 గంటలకు మదనపల్లె చేరుకుంటుందన్నారు. రాను పోను ఛార్జి రూ.2000 చెల్లించాలన్నారు. అలాగే ప్రతి కార్తీక సోమవారాల్లో ఉదయం 5 గంటలకు మదనపల్లె నుంచి బయలుదేరి తలకోన, ముక్కోటి, గుడిమల్లం, శ్రీకాళహస్తి, కపిలతీర్థం దేవాలయాలు దర్శించుకుని మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానుపోను చార్జీలు రూ.600 చెల్లించాలన్నారు. టిక్కెట్ల కోసం 9959225676, 7382875034, 9440858510 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు జేఎన్‌టీయూ బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు



బ్రోచర్‌ను విడుదల చేస్తున చొప్పా అభిషేక్‌రెడ్డి

రాజంపేట : ఏఐటీఎస్‌లో జేఎన్‌టీయూ - ఏ ఇంటర్ యూనవర్సిటీ బాల్ బాడ్మింటన్ ఎంపికలు బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి చాంబరులో ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి ఎంపికల బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూ - ఏ యూనవర్సిటీ స్థాయిలో క్రీడా ఎంపికలకు వేదికగా ఏఐటీఎస్ ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ ఎంపికలకు జెఎన్‌టీయుఏ పరిధిలోని క్రీడాకారులు హాజరవుతారన్నారు. ఈ ఎంపికల ప్రారంభోత్సవానికి జెఎన్‌టీయుఏ సెక్రటరీ ఆఫ్ స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి హాజరుకానున్నారన్నారు,. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, పీడీ నాగముని తదితరులు పాల్గొన్నారు.

మొదలైన దీపావళి సందడి

కడప కల్చరల్ : నగరంలో దీపావళి పండుగ సందడి మొదలైంది. పండుగకు కేవలం మూడు రోజులే గడువు ఉండడంతో టపాసుల దుకాణాలను ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ సందర్భంగా కాల్చే టపాసుల కోసం నగరంలో ప్రత్యేకంగా రెండు చోట్ల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎప్పుడూ దుకాణాలు ఏర్పాటు చేసే మున్సిపల్ మైదానంలో ప్రస్తుతం ఎగ్జిబిషన్ జరుగుతుండడంతో ప్రస్తుతం నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలోనూ, బిల్టప్ వద్దగల మైదానంలోనూ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఒకచోట 50, మరోచోట 30 స్టాల్స్‌ను ఏర్పాటుకు అధికారులు అనుమతించినట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం నుంచి దుకాణాలు ఏర్పాటై స్టాక్ తెచ్చిపెట్టుకుని విక్రయాలకు సిద్ధం చేసుకునేందుకు యజమానులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వేదిక మార్పు

తొలుత టపాసుల దుకాణాలను నగరంలోని స్కౌట్ హాలు మైదానం, బిల్టప్ వద్దగల ఈద్గా మైదానాలలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు దుకాణాల నిర్మాణం కూడా ప్రారంభించారు. కానీ స్కౌట్ హాలు మైదానంలో టపాసుల దుకాణాల ఏర్పాటుపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో అధికారులు స్కౌట్ హాలు మైదానాన్ని రద్దు చేసి ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటుకు సముఖత వ్యక్తం చేశారు. టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు భద్రతా ప్రమాణాలు పాటించాలని అధికారులు సూచించారు.

ఘనంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే

మదనపల్లె సిటీ : మదనపల్లెలో మంగళవారం కొత్త ఇండ్లు ప్రాథమికోన్నత పాఠశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే ఘనంగా నిర్వహించారు. కొత్త ఇండ్లు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రాజగోపాల్ మాట్లాడుతూ స్కౌట్స్ సేవలను వివరించారు. విద్యార్థులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విజయవాడ నుంచి వచ్చిన విద్యార్థులకు చతుర్థచరణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అనిత, ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ స్కౌట్స్,గైడ్స్ ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండర్ బెడన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్కౌట్స్, గైడ్స్ చేస్తున్న సేవల గురించి స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి శకుంతలమ్మ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, మోహన్‌వల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్కౌట్స్ ట్రూప్ ప్రారంభం

వాల్మీకిపురం : స్థానిక ప్రభుత్వ పీవీసీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం భగత్‌సింగ్ స్కౌట్స్ ట్రూప్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమరనాథ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కౌట్ ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ స్కౌట్‌లో విద్యార్థులకు సేవాదృక్పథం, జీవన నైపుణ్యాలు, జట్టు కృషి, శారీరక దారుఢ్యం వంటి వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణప్ప, నాగరాజు, వసుమతి, కల్పలత, ఉషారాణి, పురుషోత్తం, స్కౌట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్‌కు దూరం

వైవీయూ : క్యాన్సర్ కారకాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తే, ఆ వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. మంగళవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్, కెరీర్ గైడెన్స్ సెల్, మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో 'మహిళల ఆరోగ్య సమస్యల నివారణ' అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ శరీరంలో ఉన్న కణాల అభివృద్ధిలో విపరీత పెరుగుదలే క్యాన్సర్‌కు కారకమన్నారు. మారుతున్న జీవనశైలి వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. మొదటి, రెండవ స్టేజీలలో క్యాన్సర్ నయం కావడం సులువని, తర్వాత కష్టంగా మారుతుందన్నారు. శరీరంలో మార్పులు కనిపించగానే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడంలో వారధులుగా మారాలన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా హాజరైన ప్రముఖ జనరల్, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డా. ఎం. పావని మాట్లాడుతూ మహిళల్లో క్యాన్సర్‌కు గురయ్యే శరీరభాగాలు, వైద్యసౌకర్యాలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ డా. సుజాత మాట్లాడుతూ సంప్రదాయ జీవన విధానం సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమన్నారు. అనంతరం నోబుల్ ప్రైజ్ విజేత మేరీ క్యూరీ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను అతిథులు పరిశీలించారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ డైరెక్టర్ డా. కె. లలిత, మైనార్టీ సెల్ డైరెక్టర్ డా. కె. రియాజున్నీసా, అధ్యాపకులు డా. సరిత, డా. మునికుమారి, డా. సురేష్‌బాబు, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి శివరాం తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూళ్లు ఆపాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పది పరీక్షల ఫీజుపేరుతో అధికంగా వసూలు చేస్తున్నారని విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం రూ. 125 వసూలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కానీ జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల ప్రాంతాలలోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల వద్ద నుంచి రూ. 5 వందల నుంచి వెయ్యి వరకు ఫీజును వసూలు చేస్తున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.